

ఇక విరాళాలు వద్దు

- వైద్యానికి అవసరమైన నగదు సమకూరింది
- చిన్నారి ఆద్య తల్లిదండ్రుల విజ్ఞప్తి

కవిటి : ఎల్‌హెచ్‌ఎల్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న మండలంలోని ప్రగడపుట్టుగకు చెందిన తొమ్మిది నెలల చిన్నారి యాంద్రాపు ఆద్య వైద్యానికి అవసరమైన నగదు సమకూరిందని, ఇక విరాళాలు ఎవరూ ఇవ్వవద్దని ఆద్య తల్లిదండ్రులు యాంద్రాపు చిరంజీవి, అంజలి తెలిపారు. చిన్నారి వైద్యం కోసం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'చిన్ని గుండెకు పెద్ద కష్టం' కథనానికి దాతలు ఉదారంగా స్పందించారని, రూ.18,83,000 అందినట్లు చెప్పారు. ఇప్పటికీ కొంతమంది దాతలు తమకు సాయం అందించేందుకు వస్తున్నారని, ఇప్పటికే తమ పాప వైద్యం కోసం అవసరమైన నగదు సమకూరిందన్నారు. తమలాగే బాధపడుతున్న మరొకరికి ఆ సహాయమందిస్తే వారికి ఊరట లభించినట్లవుతుందని తెలిపారు.

సిపిఎస్ రద్దుకు ధర్మ పోరాటం

- సిపిఎస్‌ను రద్దు చేస్తారా? గద్దె దిగుతారా?
- కలెక్టరేట్ వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న సిపిఎస్ ఉద్యోగుల సంఘ నాయకులు, ఉద్యోగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిపిఎస్ ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎపి సిపిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షులు గురుగుబెల్లి భాస్కరరావు అన్నారు. ఇదే డిమాండ్‌పై ఎపి సిపిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ సమీపాన జ్యోతిరావు పూలే పార్కు వద్ద ధర్మ పోరాట నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. సెప్టెంబరు ఒకటో తేదీన సిపిఎస్ ఉద్యోగులకు చీకటి రోజన్నారు. సిపిఎస్, జిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ భారాన్ని తగ్గించుకోవడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయుల డబ్బును పెట్టుబడిదారులకు అందుబాటులోకి తేవడానికి ప్రపంచబ్యాంకు సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి సిపిఎస్ విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ విధానాన్ని అమలు చేసే బాధ్యతలను రాష్ట్రాలకు బదలాయించినట్లు తెలిపారు. ఉద్యోగుల భవిష్యత్‌ను షేర్ మార్కెట్లో కార్పొరేట్ సంస్థల్లో తాకట్టు పెట్టిందని విమర్శించారు. ఈ పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వం గ్రాట్యుటీ ఫ్యామిలీ పింఛన్‌ను తీసుకొచ్చిందన్నారు. పాదయాత్రలో పాత పింఛన్‌ను అమలు చేస్తానని సిఎం జగన్ హామీనిచ్చారని గుర్తుచేశారు.

కమిటీలతో కాలయాపన

కమిటీలతో కాలయాపన చేయనని చెప్పిన ముఖ్యమంత్రి టక్కర్ కమిటీ నివేదిక అధ్యయనానికి మంత్రుల కమిటీ, అధికారులతో ఒక కమిటీ నియమించి తన నిజ స్వరూపాన్ని బహిర్గతం చేసుకున్నారన్నారు. రాజ్యాంగ పరమైన, న్యాయపరమైన హక్కులు పోరాటాల ద్వారానే సాధించుకోవాలనే దఢ సంకల్పంతో సిపియస్ ఉద్యోగుల ఏకతాటిపైకి వచ్చి ఒకే వేదిక ద్వారా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో తమ నిరసనను ప్రభుత్వానికి తెలిస్తున్నామన్నారు.. ఇప్పటికైనా ప్రభుత్వం దిగిరాకపోతే రాబోయే ఎన్నికల్లో సత్తాను చూపి గద్దె దించుతామని హెచ్చరించారు. ఈ శిబిరంలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు కిలారు నారాయణ రావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పొందూరు అప్పారావు, ఎస్. కిశోర్ కుమార్, బొణిగి భాస్కరరావు, జయమ్మ, అంపోలు షణ్ముఖరావు, కొత్తపల్లి ప్రకాష్, బొణిగి శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

అక్రమ బదిలీలు ఆపాలి

డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జూన్‌లో ఉపాధ్యాయుల బదిలీలు జరిగి నేటికీ మూడు నెలలు కావస్తున్నా జీతాలు మంజూరు చేయలేదు సరికదా ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచే అక్రమ బదిలీలు చేసే విషయంలో విద్యాశాఖ అధికారులు పనిచేస్తున్నారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ విమర్శించారు. అక్రమ బదిలీలు ఆపాలని డిమాండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు శుక్రవారం ధర్నా చేపట్టారు. జిల్లాలో సుమారు 40 అక్రమ బదిలీలు చేయాలని వెబెక్స్ సమావేశం ద్వారా విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారని చెప్పారు. దీంతో డిఇఒ త్వరితగతిన ఉత్తర్వులు విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేశారని తెలిపారు. అనంతరం కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందించారు. ధర్నాలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శి జి.సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ఉమాశంకర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



తలుపు గడియ పెట్టిన గ్రామస్తులు

పింఛన్ మంజూరైనా ఇవ్వరా..?

- ఎంపిడిఒ కార్యాలయం తలుపులు మూసివేత
- ధర్నా చేసిన గ్రామస్తులు

ప్రజాశక్తి - బూర్జ

సామాజిక పింఛను మంజూరైనా లబ్ధిదారునికి పింఛన్ మొత్తం అందజేయకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని బూర్జ గ్రామస్తులు ఎంపిడిఒను నిలదీశారు. మండల కేంద్రంలో ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఒకటో తేదీన గ్రామంలో పెన్షన్లు అందజేసినా గ్రామానికి చెందిన బి.రాములుకు పింఛను మొత్తాన్ని అందజేయలేదన్నారు. ఈయనకు ఎనిమిది నెలల కిందట అప్పటి ఎంపిడిఒ సురేష్ కుమార్ పింఛన్ నిలుపుదల చేశారని అన్నారు. పీడీ ఆదేశాల మేరకు మూడు నెలల పింఛన్ మంజూరైందని, అయినా లబ్ధిదారునికి ఎందుకు అందజేయలేదని బూర్జ వైసిపి నాయకుడు తొత్తడ సురేష్, ఎంపిడిఒ రవీంద్రబాబును ప్రశ్నించారు. ఈ క్రమంలో అధికారులతో గ్రామస్తులకు వాగ్వాదం చోటుచేసుకుంది. అదే సమయంలో ఎంపిడిఒ కార్యాలయం తలుపులకు గడియ వేశారు. అనంతరం కార్యాలయం బయట వైసిపి నేతలతో పాటు గ్రామస్తులు ధర్నా చేసి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ రవీంద్రబాబు మాట్లాడుతూ లబ్ధిదారునికి పింఛను మొత్తాన్ని అందజేయాలని కార్యదర్శికి చెప్పామన్నారు. జాప్యానికి గల కారణాన్ని తెలుసుకుంటామన్నారు. లబ్ధిదారునికి పింఛను అందజేసేందుకు చర్యలు చేపడతానని హామీనిచ్చారు.

2న నాటిక ప్రదర్శన

శ్రీకాకుళం : శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల రెండో తేదీన నాటిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు సమాఖ్య ప్రతినిధులు పి.నరసింహమూర్తి, రామచంద్రదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సాయంత్రం ఆరు గంటల నుంచి జరిగే కార్యక్రమంలో పేద కళాకారులకు పింఛన్ల పంపిణీ, నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

కౌలు రైతులకు రూ.21 కోట్ల రైతుభరోసా

- 236 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.19.59 లక్షలు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



నమూనా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


జిల్లాలో 2,801 మంది కౌలు రైతులకు రూ.21 కోట్లు రైతుభరోసాతో పాటు అధిక వర్షాల కారణంగా 78.36 ఎకరాల్లో నష్టపోయిన 236 రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ 19.59 లక్షలు ప్రభుత్వం విడుదల చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. అర్హులైన కౌలు రైతులకు చివరి విడత రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు. ఈ ఏడాది మే, ఆగస్టు మధ్య కురిసిన వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసినట్లు వివరించారు. గార, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో అధిక వర్షాలు, గాలుల కారణంగా 78.36 ఎకరాల్లో అరటి పంట నష్టపోయిన 236 రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.19.59 లక్షలు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు.

అర్హులు ఏఒక్కరూ మిగిలిపోకుండా ఈ-క్రాప్ ఆధారంగా పంట నష్టాలను అంచనా వేస్తూ గ్రామ సచివాలయాల్లో అర్హుల జాబితా ప్రదర్శించి, సీజన్‌లో జరిగిన పంట నష్టాన్ని సీజన్ ముగిసేలో గానే నేరుగా రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు పంట నష్టపరిహారం నమూనా చెక్కులను అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, డిసిసిబి ఛైర్మన్ కె.రాజేశ్వరరావు, కళింగవైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, జిల్లా అగ్రికల్చరల్ అడ్వైజరీ ఛైర్మన్ నేతాజీ, సభ్యులు గొండు రఘురాం, వ్యవసాయ శాఖ జెడి కె.శ్రీధర్, ఉద్యానవన శాఖ ఎడి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డులు



దామోదరరావు



లక్ష్మణరావు

ప్రజాశక్తి - లావేరు, వజ్రపుకొత్తూరు

లావేరు మండలంలోని ఇజ్జాడపాలెం మండల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురుగుబెల్లి దామోదరరావు, వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గొల్లపల్లి లక్ష్మణరావుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనెల ఐదో తేదీన ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. వీరికి జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ పి.శ్రావణి, సహచర ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు.

చంద్రబాబుకు శిక్ష తప్పదు

శ్రీకాకుళం అర్బన్ : సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు చట్టంలో లొసుగులతో తప్పించుకుంటున్నారని, ఎప్పటికైనా ఆయన శిక్షార్హుడని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు ఐటి నోటీసులు జారీ చేయడం హర్షనీయమన్నారు. రూ.118 కోట్ల అవినీతికి పాల్పడినట్లు గతంలోనే అతనిపై ఆరోపణలు ఉన్నాయని, ఈ అక్రమాలపై అతని వివరణ సంతృప్తికరంగా లేని కారణంతో ఆదాయపన్ను శాఖ సంతృప్తి చెందక అతనికి నోటీసులు ఇచ్చిందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తాత్కాలికంగా ఆయన తప్పించుకోవచ్చని అంతిమంగా ధర్మానిదే విజయమన్నారు.

పిఎం విశ్వకర్మకు ఆన్‌లైన్ దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. హస్తకళలను చేతివృత్తిగా ఉన్న కుటుంబ వారసత్వంగా వృత్తిలో కొనసాగుతున్న వారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. అర్హత గల లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుందన్నారు. దరఖాస్తు చేసుకున్న సంఘాలకు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు రుణం పొందేందుకు వీలు కల్పించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సిఎస్‌సిలు ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువ మందికి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. రిజిస్ట్రేషన్ తర్వాత శిక్షణ ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఐడి కార్డు, సర్టిఫికెట్ ద్వారా గుర్తింపు రానుందని, వ్యాపారాభివృద్ధికి రుణాలు పొందేందుకు వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఎల్‌డిఎం సూర్యకిరణ్, పరిశ్రమల శాఖ ఎడిలు రమణారావు, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక నిధులు కేటాయించి పెద్దపీట వేస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలో డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ అనుబంధంగా ఉన్న రెడ్డీస్ ఫౌండేషన్ నేతృత్వంలో అత్యాధునికంగా రూపొందించిన పిహెచ్‌సి భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజలకు వైద్యం సకాలంలో అందించగలిగినప్పుడే ప్రభుత్వ పాలనా ఫలాలు ప్రజానీకానికి దక్కినట్లు భావించాలన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆస్పత్రులు, బ్లడ్ బ్యాంకులు, యాంత్రికరణతో వ్యవసాయం చేయడం, విత్తనాలు, ఎరువుల పంపిణీ పంపిణీ, పాఠశాలలకు భవనాల సమకూర్చేందుకు ముందుకొస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ఔదార్యతను ప్రశంసించారు. ప్రజలకు, ప్రభుత్వం అందించే ప్రతి సేవలోనూ, స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించగలిగితే అద్భుతమైన ఫలితాలు సాధ్యపడతాయన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు ముందుకొస్తే ఆయా సంస్థలను పరిపుష్టి చేసేందుకు దోహదకారిగా నిలుస్తుందన్నారు. జిల్లాలో 11 పిహెచ్‌సి భవనాల ఆధునీకరణ, సుందరీకరణ చేపట్టేందుకు రెడ్డీస్ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. వాటిలో సరుబుజ్జిలి పిహెచ్‌సి ఆధునికీకరణ చేపట్టడాన్ని రెడ్డీస్ యాజమాన్యానికి అభినందించారు. డాక్టర్ ఛాంబర్, ఫార్మా, ల్యాబ్, ఆరు పడకలు, ఆస్పత్రిలో పలు భవనాలను ఆధునీకరించారు. కార్యక్రమంలో రెడ్డీస్ సిఇఒ సమీర్ త్రేహన్, రెడ్డీస్ హెడ్ హెల్త్ న్యూట్రిషన్ ఎస్.శ్రీనివాసరావు, రెడ్డీస్ సిఇఒ ప్రవీణ్‌కుమార్ చౌదరి, రెడ్డీస్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.సురేష్, డిఎంహెచ్ఒ బొడ్డేపల్లి మీనాక్షి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవ్యశ్రీ, డాక్టర్ సంతోష్, ఎంపిపి కె.వి.జి.సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బెవర మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద 'సమరభేరి'



వజ్రపుకొత్తూరు : నగరంపల్లి సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన చేపడుతున్న సమరభేరి కార్యక్రమంలో భాగంగా నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించాలని, విద్యుత్ కోతలు ఆపాలని జిల్లాలోని పలు మండలాల్లో సచివాలయాల వద్ద శుక్రవారం ధర్నాలు చేపట్టారు. అనంతరం సచివాలయాల కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా కోటబొమ్మాళి మండలంలోని కోటబొమ్మాళి, ఊడికలపాడు, చీపురుపాడులో విద్యుత్ బిల్లులు దహనం చేసి సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 4న జిల్లావ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల వద్ద చేపడుతున్న ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమంతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని కొన్నావీధి సచివాలయం వద్ద చేపట్టిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, టి.తిరుపతిరావు, ఎం.గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మందస మండలంలోని మందస, భైరిసారంగపురం సచివాలయాల వద్ద చేపట్టిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, పి.దేవేంద్ర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం మండలంలోని జె.ఆర్.పురం సచివాలయం వద్ద ధర్నా అనంతరం కార్యదర్శి ఎల్.ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెలమల రమణ, సిహెచ్.అమ్మన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి మండలంలోని చాపర సచివాలయం వద్ద ధర్నా అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సూరయ్య, పోలాకి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం సచివాలయం వద్ద చేపట్టిన ధర్నాలో సిపిఎం నాయకులు పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి మండల కేంద్రంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.నాగమణి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి సచివాలయం వద్ద ధర్నా అనంతరం విఆర్ఒ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎన్.మోహనరావు, నాయకులు టి.భాస్కరరావు, డి.భానుమతి, బి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి మండలం తొలుసూరుపల్లిలో చేపట్టిన కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పలాస మండలంలోని కాశీబుగ్గ సంత మైదానంలోని సచివాలయం వద్ద ధర్నా అనంతరం సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి ఎన్.గణపతి, జి.గోవింద్, ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు మండలంలోని మెట్టూరు సచివాలయంలో ధర్నా చేపట్టారు.



కోటబొమ్మాళి : వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నిమ్మక అప్పన్న, సవర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గార మండలం బూరవల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగరాపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న పగడాలమ్మ

పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని బోరుభద్ర, వల్లేవలస; వడ్డివాడ పాఠశాలలను డిప్యూటీ డిఇఒ జి.పగడాలమ్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల సిలబస్, పుస్తకాలు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెడుతుతుందని, తదనుగుణంగా మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. డైరీ, లెసన్ ప్లాన్స్, టీచింగ్ నోట్స్ రాసి ఉండాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి ప్రధానోపాధ్యాయులు కామరాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, భాస్కరరావు, ధనుంజయరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ఆన్‌లైన్ మోసాలతో తస్మాత్ జాగ్రత్త

ఆమదాలవలస : ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఆర్బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యత పై స్వయం శక్తి సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్ వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. బ్యాంకులు ఎప్పుడూ ఖాతాదారుల వివరాలను ఫోన్ చేసి తెలుసుకోవని తెలిపారు. ఏటీఎంలలో అపరిచితులకు కార్డును ఇచ్చి డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కోరరాదని తెలిపారు. రూపే ఏటీఎం కార్డుల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు.. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, రామప్పడు, ఎంఎంఎస్ అకౌంట్ కల్యాణి, సిఎఫ్‌లు ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో ఆర్డినేటర్లు చిగురుపల్లి. వెంకటేష్ (చిన్నా) రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సువర్ణావకాశం

ప్రజాశక్తి- జి.సిగడాం

ప్రతిభ గలిగిన విద్యార్థులకు కేంద్రం ఏటా అందిస్తున్న జాతీయ ప్రతిభా ఉపకార వేతనానికి (ఎన్ఎంఎంఎస్) సంబంధించి ప్రస్తుత విద్యా సంవత్సరంలో దరఖాస్తుల స్వీకరణకు విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిలో ఉత్తీర్ణత సాధించిన వారికి నాలుగేళ్ల పాటు రూ.12 వేల చొప్పున ప్రభుత్వం ఉపకార వేతనాన్ని జమ చేయనుంది. ఉపాధ్యాయుల చొరవ, చదువుపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హత సాధిస్తున్నారు. ఏటా జిల్లాలో వందల మంది దీనికి ఎంపికై తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్లపాటు ఉపకారాన్ని పొందుతున్నారు. గతేడాది జిల్లా పరిధిలో పాఠశాలల నుంచి కొన్ని వేల మందికిపైగా విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. గతేడాది డిసెంబరులో జరిగిన పరీక్ష ద్వారా సుమారు 186 మంది వరకు అర్హత సాధించారు. అందులో జి.సిగడాం మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఇందులో గ్రామీణ ప్రాంత పాఠశాలల నుంచి ప్రతిభ చాటినవారే అధికంగా ఉన్నారు. తాజాగా ఈ ఏడాది ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇందుకోసం నోటిఫికేషన్ విడుదలైంది. దీనిని ఉపయోగించుకుంటే ప్రతిభ ఉన్నవారు ఉపకారాన్ని పొందుతారు.

సిలబస్, మార్కులు

ఇదే సమయంలో పోటీ పరీక్షలపైనా అవగాహన పెంచుకునే అవకాశం కలుగుతుంది. ఇందులో రెండు విభాగాలు ఉంటాయి. మొదట విభాగంలో మెంటల్ ఎబిలిటీ 90 మార్కులకు పరీక్ష ఉంటుంది. రెండో విభాగంలో లెక్కలు


పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

20 మార్కులు, భౌతిక శాస్త్రం 12 మార్కులు, రసాయన శాస్త్రం 11 మార్కులు, బయాలజీ 12 మార్కులు, హిస్టరీ 10 మార్కులు, జియోగ్రఫీ 10 మార్కులు, పొలిటికల్ సైన్స్ 10 మార్కులు, అర్థశాస్త్రం 5 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. అన్ని ప్రశ్నలకూ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఉంటాయి. మొత్తం 180 ప్రశ్నలకు, 180 నిమషాల సమయం ఉంటుంది.

15 వరకు అవకాశం

దరఖాస్తుకు సెప్టెంబరు 15వరకు అవకాశం ఉంది. ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు, మున్సిపల్, ఎయిడెడ్, వసతి సదుపాయం లేని ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఆదాయం ఏడాదికి రూ. 3.5 లక్షలు మించకూడదు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రూ.50, ఒసి,బిసి విద్యార్థులకు రూ.వంద పరీక్ష రుసుం చెల్లించాలి. ఏడో తరగతిలో ఒసి, బిసిలకు 55 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలకు 50 శాతం మార్కులు పొంది ఉండాలి.

ఒబిసిలు మినహా మిగిలిన వారు సంబంధిత కుల, ఆదాయ ధ్రువపత్రాలు సమర్పించాలి. ఆధార్ కార్డులో ఉన్న ప్రకారమే, పాఠశాల రికార్డులో వివరాలు నమోదై ఉండాలి. విద్యార్థి పేరున బ్యాంకు ఖాతా ఉండాలి. డిసెంబరు 3న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

పేద విద్యార్థులకు మంచి అవకాశం



ప్రతి పేద విద్యార్థికీ ఈ ఎన్ఎంఎంఎస్ వల్ల చాలా ఉపకారం పొందుతారు. అలాగే ఈ డబ్బులు ఆ విద్యార్థి భవిషత్ చదువుకు ఉపయోగపడుతుంది. విద్యార్థికి మానసిక వికాసం పెరుగుతుంది. ముఖ్యంగా పోటీ పరీక్షలకు వెళ్లడం విద్యార్థులకు అన్నివిధాలా మేలుకలుగుతుంది.

- రవికుమార్, ఎంఇఒ

వినియోగించుకోవాలి



ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా ప్రతి విద్యార్థి స్థాయి నుంచీ పోటీ పరీక్షలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలి. ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనం పొందినవారు నాలుగేళ్ల పాటు తమ చదువును కొనసాగించాలి. చదువును పూర్తి చేయడానికి ఈ నగదు ఎంతో సాయమవుతుంది. ఇలాంటి అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

- లంక అన్నా శామ్యూల్, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తిలక్

సమిష్టి కృషితోనే అభివృద్ధి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జిల్లా ఎల్ఐసి కార్యాలయంలో 67వ బీమా వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి చీఫ్ మేనేజర్ సత్యనారాయణ సాహు, యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎంవితిలక్‌లు కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ సాహు మాట్లాడుతూ పాలసీదారులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో ఉద్యోగులు. ఏజెంట్ మిత్రులు ఫీల్డ్‌ఫోర్స్ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎల్ఐసిని 130 మంది కోట్ల ప్రజల్లో గట్టి నమ్ముతున్నారని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో అచ్యుతవల్లి లక్ష్మి, మధుసూదనరావు, తారక్, గిరిధర్, రామకృష్ణ, వలసయ్య. దామోదరరావు, అప్పన్నదొర, ధనుంజయరావు, రమణమూర్తి, ప్రతాప్, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

నేడు వ్యాసరచన, క్విజ్ పోటీలు

శనివారం మధ్యాహ్నం 3 గంటలకు హైస్కూల్ విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు ఎల్ఐసి బ్రాంచ్ ఆఫీస్‌లో నిర్వహిస్తున్నట్లు సత్యనారాయణ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు డిగ్రీ విద్యార్థులకు ఎలక్యూషన్ కాంపిటీషన్ జరుగుతుందన్నారు. నగరంలో 5న ఇన్సూరెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించనుననట్లు తెలిపారు. బీమా వారోత్సవాల్లో ఉద్యోగులు ఏజెంట్లు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గడిచిన రెండు రోజులుగా కోటబొమ్మాళి మండలంలో పగలు, రాత్రి అని తేడ లేకుండా సమయంలో పనిలేకుండా అప్రకటిత విద్యుత్ కోతలు ఉండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్క ఎండలు, మరో పక్క విద్యుత్ కోతలు ఉండటంతో వృద్ధులు, చిన్నారులు, పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది ఇలా రోజుకు గంటలు గంటలు సమయం విద్యుత్ నిలుపుదల చేయడం, ముఖ్యంగా రాత్రి పడుకుందామనుకొనే సమయానికి విద్యుత్ తీయడంతో పగలంతా కష్టపడి వచ్చిన రైతులు, కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

తరగతి గదిలో అప్రమత్తం

ప్రజాశక్తి- టెక్కలి

విద్యార్థినులు తమ తరగతి గదుల్లో అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యాన శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము సంచరిస్తు, విధులు నిర్వర్తించిన చోట, చదువుకునే ప్రదేశాల్లో ఉన్న పరిసరాలను అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థినుల్లో స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలన్నారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి, ప్రధానోపాధ్యాయులు డి.నాగభూషణం, శోభారాణి, ఎఎస్ఐ కేశవ, న్యాయవాదులు దవళ రాజేశ్వరరావు, పేడాడ బాబూరావు, వైకుంఠరావు, పాణిగ్రహి, పైల చంద్రుడు, సాయిరాజ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌతు శిరీష

'భవిష్యత్‌కు గ్యారంటీ'తో భరోసా

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాస : వైసిపి విధానాలతో విసిగిపోయిన ప్రజలకు భరోసా ఇచ్చేందుకు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను వివరించాలన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ పరిధిలో 200 కుటుంబాలను కలిసి భవిష్యత్‌కు గ్యారంటీ ధ్రువపత్రాలు అందించామని అన్నారు. కార్యక్రమంలో పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి విఠల్‌రావు, ఐటిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయ్, కార్యాలయ కార్యదర్శి సూర్యనారాయణ, హరిపురం కార్యాలయ కార్యదర్శి ఢిల్లీ, ప్రభు, సాయి, మార్కండేయ పాల్గొన్నారు.

బూర్జ : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ పీరికట్ల విశ్వప్రసాద్ అన్నారు. మండలంలో తోటవాడలో భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ వైస్ ఎంపిపి పీరికట్ల ప్రభాకరరావు, పీరికట్ల సీతబాబు, మాజీ సర్పంచ్‌లు ప్రసాదరావు, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలకు స్పందన


ఆమదాలవలస : మెమొంటోను అందజేస్తున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సినీనటుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు రక్తదానం చేశారు. న్యూ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో శుక్రవారం నిర్వహించిన ఈ శిబిరాన్ని చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను, బలభద్రుని రాజా, దళిత జెఎసి చైర్మన్ డాక్టర్ కంఠ వేణులు ప్రారంభించారు. ఈ మేరకు 60 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం ప్రతినిధులు గొర్లె కిరణ్, పి.కిరణ్‌రెడ్డి, బడే మోహన్, లింగాల హరీష్, గౌతమ్, సిద్ధు, చంటి, సాయివిజయ్, టి.శేఖర్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగవున జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 45 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాత్రుని పాపారావు, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు పైడి మురళీమోహన్, శిర్లాపు గణేష్, గంగు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి పాలనంతా అరాచకమే

ఎమ్మెల్యే బెందాళం అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒక్క అవకాశం అంటూ ప్రజలని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన అరాచకాలతో అల్లకల్లోలం చేశారని ఎమ్మెల్యే అశోక్ విమర్శించారు. నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్ర విజవంతంగా 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇచ్ఛాపురంలో శుక్రవారం సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. ఆలయం వీధి నుంచి బెల్లుపడ కూడలి, దాసన్నపేట, మార్కెట్ రోడ్, పాత బస్‌స్టాండ్ కూడలిలోని మాజీ ఎంపీ ఎర్రంనాయుడు విగ్రహం వరకు కొనసాగింది. పాదయాత్రలో టిడిపి నేతలు కాళ్ల ధర్మారావు, సాలీనా ఢిల్లీ, సీపాన వెంకట రమణ, రమేష్ తదతరులు పాల్గొన్నారు.


సంఘీభావ పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్



'ఆడుదాం ఆంధ్రా' పోటీలపై సమీక్ష


మాట్లాడుతున్న భవానీశంకర్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ టి.భవానీశంకర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కమిటీ ఏర్పాటుకు సంబంధించి అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలు అక్టోబరు 2 నుంచి 8 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయం నుంచి ఐదు దశల్లో రాష్ట్రస్థాయి వరకు వెళ్తారని అన్నారు. ఇందుకు అవసరమైన మైదాన వ్యాపింగ్, ఇతర సౌకర్యాలపై పంచాయతీ కార్యదర్శులతో, పీడీలతో, పిఇటిలతో మండలంలో ఆట స్థలాలను పరిశీలించాలన్నారు. అనంతరం టీమ్‌లను తయారు చేయాలన్నారు. 15 ఏళ్ల పైబడిన వారు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాడ్మింటన్, క్రికెట్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమంపై సమీక్షించారు. సమావేశంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేందర్, ఎఒ తిరుపతి పట్నాయక్ పాల్గొన్నారు.

బి.గ్రేడ్ ఆర్టిస్టులుగా శృతి, కావ్య ఎంపిక

ఇచ్ఛాపురం : దూరదర్శన్ యాదగిరి టివి ఛానల్ రామంతపూర్ హైదరాబాద్‌లో బి.గ్రేడ్ ఆర్టిస్టుల ఎంపికలో ఇచ్ఛాపురం వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమికి చెందిన నాట్య గురువు శృతి పట్నాయక్, దట్టి కావ్య ఎంపికయ్యారు. ఆగస్టులో నిర్వహించిన ఎంపికలో దూరదర్శన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్.రవీందరరావు మెసేజ్ ద్వారా ఎంపికైనట్లు సమాచారం అందించారని అకాడమి చైర్మన్ చిన్న గురు స్వామి తెలిపారు. 18 ఏళ్ల నిండిన కళాకారులు కూచిపూడిలో ధ్రువపత్రాల కోర్సు, డిప్లమో కోర్స్ చేసిన కళాకారులకు ఈ ఆడిషన్స్‌కు అవకాశాన్ని కల్పించారని అన్నారు. ఒక్కో పాట 15 నిమిషాలు చొప్పున జతిస్వరం, బ్రహ్మాంజలి, దశవతారం, తిల్లనా పాటలకు నృత్యం చేశారని అన్నారు. వీరు ఎంపికపై ప్రముఖ కూచిపూడి గ్రామం నాట్యచార్య యేలేశ్వరపు శ్రీనివాసులు, అకాడమీ వ్యవస్థాపకులు చిన్నా గురుస్వామి, జయలక్ష్మి దంపతులు అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బొమ్మాళి తాతయ్య

వ్యాపారుల ఆరోపణలు వాస్తవం కాదు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జీడి ఉత్పత్తి సంఘం నాయకులు కార్మికులను దొంగలుగా ముద్ర వేసి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, జీడి పరిశ్రమలు వెంటనే తెరిపించి కార్మికులకు భతి కల్పించాలని జీడి కార్మికుల సంఘం అధ్యక్షులు కొవ్వూరు భీమారావు, కార్యదర్శి బొమ్మాళి తాతయ్య, గౌరవ అధ్యక్షులు అంబటి కష్ణమూర్తి అన్నారు. శుక్రవారం కార్మిక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీడి పరిశ్రమల్లో పలాస, కాశీబుగ్గకు చెందిన సుమారు 25 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని, గతంలో దొంగతనం ఆరోపణలు ఏ కార్మికుడిపై రాలేదని గుర్తు చేశారు. పలాసకు చెందిన పొట్నూరు బాలాజీ జీడి పరిశ్రమలో ప్రతి రోజు ఆ కంపెనీలో పని చేస్తున్న మహిళా కార్మికులపై నిందలు వేస్తున్నారన్నారు. లండ రమణ అనే కార్మికుడు బాలాజీ పరిశ్రమలో రెండేళుగా 10 లక్షల రూపాయలు విలువైన జీడిపప్పు దొంగతనం చేశాడనే ఆరోపణలతో జీడి ఉత్పత్తిదారుల సంఘం ఇటీవల సమావేశం నిర్వహించి పరిశ్రమలకు బంద్ పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. లండ రమణపై వ్యాపారులు తప్పుడు ఆరోపణలు చేస్తూ దొంగగా ముద్ర వేశారని, యజమానిపై కార్మికుడు లండ రమణ దాడి చేశారని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నోటీసులు ఇవ్వకుండా బంద్‌కు ఉపక్రమించడం వ్యాపారులు ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, నిజనిర్ధారణ చేసి పరిశ్రమలను తెరిపించాలన్నారు. బంద్ వలన రోజుకు 40 లక్షల రూపాయల ఆదాయాన్ని ఉపాధి రూపేణా కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తామడ రాము, కోనేరి ఈశ్వరరావు, బాబూరావు, తాతయ్య, కార్మికులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయం లాభదాయకం

శ్రీకాకుళం అర్బన్ : వ్యవసాయం పూర్వకాలంలో మొత్తం సేంద్రీయ ఎరువులపైనే ఆధారపడి పంటలు పండిచేశారని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార దిగుబడులు పెంచడానికి ఆధునిక వంగడాలతో పాటుగా రసాయనాల వాడకం పెంచాల్సిన అవసరం నెలకొందని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. స్కై కాలేజీ అగ్రికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యాన మూడు రోజుల శిక్షణా తరగతుల్లో భాగంగా ఎచ్చెర్ల మండలం ఎస్ఎస్ఆర్ పురంలో మూడు రోజుల పాటు సేంద్రీయ ఎరువుల వినియోగంపై నిర్వహించనా శిక్షణా తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేంద్రీయ ఎరువుల ద్వారా పంటలు సాగు చేస్తే ఎంతో మేలు కలుగుతుందని, భూసారానికి ఎలాంటి ముప్పు కూడా ఉండదని అన్నారు. ఇటీవల కాలంలో సేంద్రీయ ఎరువులతో


పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థిని

పండించిన ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రజలు కరోనా వచ్చాక ఆరోగ్యంపై అవగాహన పెంచుకుంటున్నారని అన్నారు. సేంద్రీయ, ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ప్రకృతి సేద్యం వల్ల దిగుబడి కొంత తగ్గినా, రుచి బాగుంటుందని, ఆరోగ్యానికి మేలు చేస్తుందని వివరించారు. సాధారణ పద్ధతిలో సాగుచేసిన వాటితో పోలిస్తే ప్రకృతి సేద్యంతో పండిస్తే మార్కెట్లో ఎక్కువ ధర లభిస్తుందని చెప్పారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు పరిధిలో రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఇఇ ఎస్.బయ్యాన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాగోలు పరిసర ప్రాంతాలైన గూడెం, వాకలవలస, రావిపాడు, బావాజీపేట, కొత్తరోఎడ్డు, అక్కివరం తోటవాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జెడ్‌పిటిసి భర్త మృతికి సంతాపం

ప్రజాశక్తి- కొత్తూరు

మండల జెడ్‌పిటిసి కామక భాగ్యవతి భర్త త్రినాథరావుపై పలువురు సంతాపం తెలిపారు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో శుక్రవారం స్వగ్రామం కుంటిభద్రలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, వైసిపి పాతపట్నం నియోజకవర్గం నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణలు పాల్గొని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట వైసిపి నాయకులు అగతముది రంజిత్ కుమార్, ఎ.నాగేశ్వరరావు, కోయిలాపు సంజీవరావు, జి.ఆనందరావు, వై.ధర్మారావు, బి.రామకృష్ణ, రమేష్, సత్యం పాల్గొన్నారు.


కేక్‌ను కట్ చేస్తున్న గోవిందరాజులు

ఘనంగా గోవిందరాజుల జన్మదినం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక టిడిపి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు కోటబొమ్మాళికి చెందిన వ్యాపారవేత్త, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు శుక్రవారం తన జన్మదినం సందర్భంగా రూ. 10 వేలు అందజేశారు. ఈ అన్న క్యాంటీను ద్వారా వందలా మంది పేదలకు రూ. 5లకే రుచికరమైన భోజనం అందిస్తున్నామని అన్నారు. తన వంతు సహాయ సహకారం అందించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, ఎఎంసి మాజీ చైర్మన్ వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ పాల్గొన్నారు.

పాత కక్షల ఫలితం ... పచ్చని చెట్లకు శాపం

పాత స్థల వివాదమే కారణమంటున్న బాధితుడు

ప్రజాశక్తి- పలాస

పాతగొడవల కారణంగా విలువైన సపోటా, మామిడి, అరటి చెట్లను నరికి భయాందోళన సష్టించారు. ఈ ఘటన పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో చోటుచేసుకుంది. పాత ఆస్తి గొడవల కారణంగా ఈ సంఘటన జరిగిందని బాధితుడు ఆరోపిస్తున్నాడు. వారం రోజుల కిందట బాధితుడికి చెందిన తోట చుట్టూ ఉండే ప్రహరీని కూల్చివేసిన సంఘటనలో పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులను విచారించకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేసి చేతులు దులపుకోవడంతో పరిస్థితి ఇంతదాకా వచ్చిందని ఆయన ఆరోపించారు. ఆ బాధితుడు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... కాశీబుగ్గలో నివాసం ఉంటున్న హరిముకుంద పండాకు మొత్తం 47 ఎకరాల జీడి, మామిడి, కొబ్బరి, అరటి, సపోటా తోటలున్నాయి. అందులోనే ఆయన నివాసం ఉంటూ 12 ఎకరాల విస్తీర్ణంలో కలియుగద్రైం వెంకటేశ్వరస్వామి ఆలయం కూడా నిర్మిస్తూ ఇటీవల వార్తల్లోకి ఎక్కారు. ఆ స్థలాన్ని ఆయన కుమారుడు ప్రముఖ వైద్యుడు హరిరాజ్ కుమార్ ఇచ్చారు. ఆయన 20 ఏళ్ల క్రితం కోటను కాపాడుకోడానికి చుట్టూ ప్రహరీ నిర్మించి, అందులో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. ఇటీవల ఆయన అనారోగ్యం పాలవడంతో హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆ తోటలో 18 సెంట్ల స్థలం తమదని ప్రసాద్ అనే వ్యక్తి పండాతో ఘర్షణకు దిగాడు. అనంతరం గోడను గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత యంత్రాలతో కూలగొట్టాడు. దీనిపై ముకుంద పండా కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అప్పట్లో తేలిగ్గా తీసుకొని నిందితులను పిలిపించి...మందలించి వదిలేశారు. ఈ సంఘటన వారం రోజుల కిందట జరిగింది. ఈ సారి గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ముకుందపండా ఎంతో ఆహ్లాదంగా పెంచుకుంటున్న పండ్ల చెట్లను నరికివేశారు. శుక్రవారం ఉదయం బాధితుడు గుర్తించి లబోదిబోమన్నాడు. మొత్తం 200 మొక్కలు వరకూ కూల్చివేయడంతో రూ.2 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఫలసాయం ఇచ్చే మొక్కలు పాత కక్షలకు బలైపోయాయని బాధితడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనను హతమారుస్తామని కూడా హెచ్చరిస్తున్నాడని, గోడ కూలగొట్టిన వారే తన చెట్లను నరికి బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నాడు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు విలేకర్లకు తెలిపారు.


మామిడి చెట్టును నరికిన దుండగులు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ

నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

కొత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి నాణ్యమైన విద్యుత్ ఛార్జీలు ఇవ్వలేరా? అని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ప్రశ్నించారు. మండలంలోని మాతల క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సిఎం జగన్ విద్యుత్ ఛార్జీలు పెంచబోనంటూనే ఈ నాలుగున్నేళ్లలో ఏడుసార్లు పెంచేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాత్రి, పగలు అనే తేడా లేకుండా విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలమట సాగర్, పి.మోహనరావు, నెల్లి అచ్యుతరావు, బి.రమణమూర్తి పాల్గొన్నారు.


శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

'ముత్తూట్' గోల్డ్ లోన్ బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక నివగాం రోడ్‌లో గోగుల రామారావు నాయుడు కాంప్లెక్‌లో ముత్తూట్ మనీ లిమిటెడ్ గోల్డ్‌లోన్ బ్రాంచ్‌ను కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక గ్రామ రేటు, అత్యల్ప వడ్డీ రేటు ఉందని, దీనిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈయన వెంట వైసిపి నాయకులు గోగుల వరప్రసాదరావు నాయుడు, బాలచంద్ర నాయుడు, ఆర్.కె.నాయుడు, పిన్నింటి రామారావు నాయుడు, రీజనల్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ కిరణ్ కుమార్ ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

శ్రీకాకుళం అర్బన్ : పోషణ మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని రాధాకృష్ణనగర్, హరిజన వీధి, మావూరువీధి అంగన్వాడీ కేంద్రాలను జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారి బి.శాంతిశ్రీ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ మేరకు కార్యకర్తలకు, సహాయకులకు ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేశారు. టేక్ హోమ్ రేషన్ త్వరితగతిన లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్ర కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్య సంబంధ సూచనలను చేశారు, ఫ్రీ స్కూల్ పిల్లలతో మాట్లాడి వారికి స్కూల్‌పై ఆసక్తి పెంచుకునేలా పలు సూచనలు చేశారు. కేంద్రాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై తగిన శ్రద్ధ చూపాలన్నారు.


పోషకాహార కిట్లను అందజేస్తున్న పీడీ శాంతిశ్రీ

నూతన పింఛన్ల పంపిణీ


ఆమదాలవలస : పింఛన్లను పంపిణీ చేస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

అర్హత కలిగిన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉద్దేశమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సరుబుజ్జిలి మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజరైన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కెవిజి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ అత్తులురి రవికాంత్, బిసి బీసీ సెల్ డైరెక్టర్ మూడడ్ల రమణ, ఎస్‌సి సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి బొడ్డేపల్లి హరి పాల్గొన్నారు.

రణస్థలం: మండల పరిషత్ కార్యాలయంలో జె.ఆర్.పురం, రణస్థలం పంచాయతీల్లో కొత్తగా మంజరైన పింఛన్లను ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, ఎంఇఒ ఆర్.త్రినాథరావు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపిటిసి పచ్చిగుళ్ల సాయిరాం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లను వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య పంపిణీ చేశారు. పార్టీలకతీతంగా పింఛన్లను సిఎం జగన్ అందజేస్తున్నారని అన్నారు.

టెక్కలి : మండలంలోని బూరగాం పంచాయతీలో కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ లోపింటి సంజీవరావు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి జనపాన తిరుమలరెడ్డి, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : అమలపాడు సచివాలయం వద్ద సర్పంచ్ దున్న రత్నం బాలరాజు కొత్తగా మంజరైన పింఛన్లను పంపిణీ చేశారు.


పళ్లు, రొట్టెలను పంపిణీ చేస్తున్న భవానీశంకర్

రోగులకు పళ్లు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు చిన్నప్పటి నుంచి సేవా కార్యక్రమాలు చేపట్టడం అలవాటు చేసుకోవాలని పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు దాచుకున్న డబ్బులతో శుక్రవారం రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు దాచుకున్న డబ్బులతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, సూపరింటెండెంట్ అగ్గున మేఘన, శ్రీను, శరత్‌బాబు, అనుదీప్ పాల్గొన్నారు.

నేడు కోటబొమ్మాళి మండల సమావేశం

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు ఆధ్వర్యాన మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని సూచించారు.


పరామర్శిస్తున్న సభ్యులు

మృతుని కుటుంబానికి అండ

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల అనారోగ్యంతో మరణించిన కవిటి మండలం కొర్రాయిపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు పాపారావు కుటుంబానికి స్థానిక యువశక్తి ఫౌండేషన్ అండగా నిలిచింది. యువశక్తి ఫౌండేషన్ సభ్యుడు బొడ్డ జగదీష్ ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'ఎంజిఆర్' పరామర్శ

పాతపట్నం : పాతపట్నం మెయిన్ రోడ్డులోని స్నేహ షాపింగ్ మాల్ మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. విషయాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు ఘటనా స్థలానికి చేరుకుని మాల్ యాజమాన్యాన్ని పరామర్శించారు. ఆయనతోపాటు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పైల బాబ్జి, తామర మాజీ సర్పంచ్ సిరిపురం బాబూరావు, గొకవలస అశోక్ ఉన్నారు.

రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

లావేరు : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని నేతేరులో శుక్రవారం సమగ్ర భూ సర్వేను స్థానిక సర్పంచ్ కొల్లి ఎల్లమ్మ, ఎంపిటిసి సభ్యులు కాగితాల కష్ణారెడ్డి కొబ్బరికాయ కొట్టి డ్రోన్ ద్వారా సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర రీసర్వేతో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. భూ తగాదాలు జీవితాలను నాశనం చేస్తాయని ముఖ్యమంత్రి గ్రహించి మీ భూమి మా హామీ కార్యక్రమం చేపట్టారన్నారు. గ్రామాల్లో గ్రామకంఠం భూములు, ఇంటిస్థలాలు, ప్రైవేట్ భూములు, వ్యవసాయ భూములు అన్ని రకాల భూములు ఎంత ఉందనేది సర్వేచేసి హక్కుపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలు సర్వేను సద్వినియోగం


ప్రారంభిస్తున్న సర్పంచ్ ఎల్లమ్మ

చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు శ్రీనివాసరావు, రామయ్య, ఉప సర్పంచ్ అలుపున కోటేశ్వరరావు, వైసిపి నాయకులు కొల్లి రవణారెడ్డి, రాజారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

పలాస విద్యార్థుల ప్రతిభ

పలాస : అంతర్జాతీయ సంస్థ యునిసెఫ్, ఎస్ఇ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ ఇన్నోవేషన్ ప్రొగ్రాం 2022-23 బూట్ క్యాంప్, గ్రాండ్ ఫినాలి పోటీల్లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వై.లోకేష్, జి.సార్థిక్, జి.లిఖిత్, డి.యుగంధర్, కె.నాగబినాయిలు విజయం సాధించారని పిడి తవిటయ్య తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన రెగినేరేటివ్ బ్రేకింగ్ సిస్టమ్ అనే ప్రాజెక్టును విజయవాడలో మూడు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శించి టాప్ 10 స్థానాల్లో నిలిచి పదివేల రూపాయల నగదు బహుమతి మెమొంటో, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎలక్ట్రికల్ వాహనాల్లో బ్రేక్ వేయడం వల్ల విద్యుదుత్పత్తి చేసి ఆ విద్యుత్తు తిరిగి అదే వాహనంలో ఉపయోగించే బ్యాటరీని చార్జింగ్ చేయడం వల్ల విద్యుత్ శక్తి, చార్జింగ్ సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గైడ్ ఉపాధ్యాయులు జె. షణ్ముఖ రావు, ప్రధానోపాధ్యాయులు డి. దాశరథి, సిబ్బంది అభినందించారు.

అనాథలకు అన్నదానం

ప్రజాశక్తి- పలాస

పలాస, కాశీబుగ్గ లయన్స్ క్లబ్ సౌజన్యంతో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు పాపినాయుడు కుమారుని పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. 79 మంది అనాధులు, వృద్ధులు, వికలాంగులకు రెండు పూటలకు సరిపడే భోజనాలను ఇంటింటికి సేవా రథం ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ కార్యదర్శి తమ్మినాన మాధవరావు, కోశాధికారి ఎన్. అప్పారావు, అధ్యక్షులు రోణంకి హేమాచలం, ఎండు దొర, సిద్దిరి మధుసూధనరావు, కొర్రాయి బాలక్రిష్ణ, ఎం. కొండలరావులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

పలాస: వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సూదికొండ ప్రాంతంలో శుక్రవారం సూదికొండ మెయిన్ రోడ్డు వినాయక స్వామి గుడి నుంచి రెడ్డి బిల్డింగ్ వరకు సీసీ రోడ్ రూ.4.85 లక్షలు, గజ్జి. వల్లయ్య ఇంటి నుంచి రెడ్డి బిల్డింగ్ వరకు సీసీ డ్రైన్ రూ.1.7 లక్షలు, కౌన్సిలర్ వీధిలో సీసీ రోడ్డుకు రూ.1.15 లక్షలు, త్రిమూర్తులు స్వామి గుడి వీధిలో రెండు డ్రైన్లు రూ1.9 లక్షల వ్యయంతో రోడ్లు, మురికి కాలువలు పలు అభివద్ధి కార్యక్రమాలకు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వార్డుల్లో మురికి


శంకుస్థాపన చేస్తున్న గిరిబాబు

కాలువలు, సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో 19వ వార్డ్ కౌన్సిలర్ శిష్టు.బందావతి, వైసీపీ నాయకులు శిష్టి గోపి, వైసిపి పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, 14వ కౌన్సిలర్ బెల్లాల.శ్రీనివాస్ 1,10,20 వ వార్డుల కౌన్సిలర్ ప్రతినిధులు దున్న.సత్యం, శార్వాణి రవి, అంబటి.ఆనందరావు, కో-ఆప్షన్ సభ్యులు రోనంకి శ్రీనివాస్, వైసిపి పట్టణ అధికార ప్రతినిధి శిష్టు.గోపి, స్థానిక నాయకులు జోగ తిరుపతిరావు, బగాది సింహాచలం, సీపాన.లోకేష్, మార్పు కృష్ణ, కల్లేపల్లి కామేశ్వరరావు, మార్పు.చిన్న, సచివాలయం సిబ్బంది, స్థానిక మహిళలు, వాలంటీర్లు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న శ్రీనివాసరావు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ఇచ్ఛాపురం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రీన్‌ఆర్మీ సంస్థ తరుపున మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై శుక్రవారం అవగాహన నిర్వహించారు. మొక్కల పెంపకం వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ సంస్థ తరపున గోపాల్ శ్రీనివాసరావు, సినీ కళాకారుడు రామకృష్ణ, అధ్యాపకులు శ్రీనివాసరావు, దుర్యోధన, సంతోష్‌కుమార్, శివకుమార్, వరప్రసాద్, బృందావనం, నాగేశ్వరరావు, నిత్యానంద పట్నాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చూడాలి

ఇచ్ఛాపురం : నియోజకవర్గంలో తలెత్తుతున్న విద్యుత్ కోతల తీవ్రత తగ్గించాలని, మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయాలని సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ సిఎండి పృధ్వీరాజ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయలు కలుగుతున్నాయని అన్నారు. గ్రామాల్లో రాత్రి సమయంలో విద్యుత్ కోతలు అధికంగా అమలు చేయడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. సమస్య తీవ్రతను తగ్గించే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి వరం సంస్మరణ కార్యక్రమాలు

శ్రీకాకుళం అర్బన్ : పురపాలక సంఘం మాజీ చైర్మన్ అంధవరపు వరహనర్సింహం మూడో వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 2 నుంచి 4 వరకు సంస్మరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, ఆమె సొదరులు అంధవరపు ప్రసాద్, సంతోష్‌లు ఒక ప్రకటనలోమ తెలిపారు. ఉదయం 10 గంటలకు 7 రోడ్ల కూడలిలో ఆయన విగ్రహానికి పూమాలలు వేసి పేదలకు తోపుడు బళ్లను పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. 3న అరసవల్లి సూర్యనారయణస్వామి ఆలయంలో వసతిగృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేయనున్నట్టు చెప్పారు. అనంతరం రిమ్స్ ఆస్పత్రి వద్ద సత్యసాయి కేంద్రంలోని అన్నదానం చేస్తున్నామని అన్నారు. 4న వరం రెసిడెన్సీలో మోటారు వర్కర్లకు దుస్తులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

వరి సాగులో పొటాష్ లోపం

వజ్రపుకొత్తూరు: ఖరీఫ్ వరిసాగులో ఎక్కువగా పొటాష్ లోపం కనిపిస్తోందని, దానిని నివారించే దిశగా రైతులు దృష్టి సారించాలని రాగోలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అమరజ్యోతి సూచించారు. మండలంలోని పెద్ద బొడ్డపాడు, రిట్టిపాడులో వ్యవసాయ క్షేత్రాలను క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా వరి పైరు పొటాష్ లోపంతో కనిపిస్తున్నాయని, దాని నివారణకు రెండోదపా ఎరువులు వాడినప్పుడు ఎకరాకు 20 కిలోల పొటాష్ కచ్చితంగా వాడాలని రైతులను సూచించారు. ఇది కాక ఉక్కపోత అధికంగా ఉన్నందున దోమ వ్యాపించే అవకాశం ఉందని, దీని నివారణకు ఎస్పేట్ ముందును 300 గ్రాములు ఎకరాకు స్ప్రే చేయాలని శాస్త్రవేత్తల బందం రైతులను సూచించి పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం. కిరణ్ వాణి, ఏఈఓలు పి.ఉదయ్ కుమార్, ఎం. జోత్స్న దున్న, సింధు, సరిత, రఘు రైతులు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు